సాక్షి మంచిర్యాల

మంగళవారం । 24 । జనవరి । 2023



నాగోబాకు మొక్కి..

ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌లో నాగోబా జాతర కొనసాగుతోంది. సోమవారం పేర్స పేన్‌కు పూజలు నిర్వహించారు. మంగళవారం నాగోబా దర్బార్ నిర్వహించనున్నారు. 8లో▸



ఘనంగా నేతాజీ జయంతి

స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు సోమవారం జిల్లాలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి నివాళులు అర్పించారు. 9లో▸

గరిష్టం/కనిష్టం 31.0 /18.0

వాతావరణం

ఆకాశం మధ్యాహ్నం ప్రకాశవంతంగా, రాత్రివేళ మేఘావృతమై ఉంటుంది. ఉత్తరం దిశగా గాలులు వీస్తాయి. చలి తీవ్రత పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

చెత్త నిర్వహణ ఉద్యమంలా సాగాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాహుల్

మంచిర్యాలఅర్బన్: పరిశుభ్రత, ఆరోగ్యవంతమైన గ్రామంగా తీర్చిదిద్ది స్వచ్ఛ తెలంగాణ నిర్మాణంలో జిల్లాను ఆదర్శంగా నిలిపేందుకు తడి, పొడి చెత్త నిర్వహణ కార్యక్రమం ఉద్యమంలా సాగాలని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ అన్నారు. సోమవారం స్థానిక జిల్లా సైన్స్ కేంద్రంలో తడి, పొడి చెత్త నిర్వహణ-మన బాధ్యత అనే అంశంపై 8, 9, 10వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, ఉపన్యాస పోటీల్లో ఆయన మాట్లాడారు. చెత్త నిర్వహణపై విద్యార్థులు తమ తల్లిదండ్రులు, సమాజానికి అవగాహన కల్పించేందుకు కృషి చేయాలని సూచించారు. విద్యార్థులు రమ్య, వరుణ్ తేజ, ఐశ్వర్య ఉపన్యాసాలను విని వారిని ప్రత్యేకంగా అభినందించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు గణతంత్ర దినోత్సవ వేడుకల్లో బహుమతులు అందజేయనున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఇంచార్జి సఫ్దర్‌అలీఖాన్, సెక్టోరల్ అధికారి చౌదరి, పర్యావరణ విద్య జిల్లా కో-ఆర్డినేటర్ యోగేశ్వర్, డీఎస్‌వో మధుబాబు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే 'నడిపెల్లి'కి నిరసన సెగ



ఎమ్మెల్యే దివాకర్‌రావును నిలదీస్తున్న మహిళలు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని ఆండాళమ్మ కాలనీలో ఉన్న మున్సిపాలిటీ డంపింగ్ యార్డు వల్ల నిత్యం దుర్వాసన, పొగ కమ్ముకుంటోందని, రోగాల బారిన పడుతున్నామని కాలనీ మహిళలు ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావును నిలదీశారు. సోమవారం డంపింగ్ యార్డు పక్కనే నిర్మించిన మిషన్ భగీరథ నీటిట్యాంకును ప్రారంభానికి రాగా, డంపింగ్ యార్డును ఇతర చోటుకు తరలించాలంటూ ఆందోళన చేశారు. రోజుల తరబడి చెత్త వేయడం వల్ల దుర్వాసన వెదజల్లుతోందని, పిల్లలు అన్నం తినడమే లేదని, వ్యాధుల బారిన పడుతున్నారని వాపోయారు. చెత్తను కాల్చడం వల్ల వచ్చే పొగ, నల్లటి చూర ఇళ్లల్లో పడుతోందని, శ్వాస సంబంధిత వ్యాధులబారిన పడుతున్నామని తెలిపారు. కాగా, నీళ్లట్యాంకు ప్రారంభానికి హాజరైన మహిళలు కార్యక్రమం ముగిసే వరకు ముక్కుకు అడ్డుగా కొంగు, ఖర్చీఫ్‌లను అడ్డు పెట్టుకుని ఇబ్బంది పడ్డారు.

లోక్ అదాలత్ విజయవంతంపై 28న సమీక్ష

మంచిర్యాలక్రైం: జాతీయ మెగా లోక్ అదాలత్ విజయవంతానికి ఈ నెల 28న పోలీస్, ఎక్సైజ్, రెవెన్యూ, బ్యాంకింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా న్యాయమూర్తి బీ.సత్తయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 11న జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వివిధ శాఖల్లో కోర్టు పరిధిలో పెండింగ్‌లో ఉన్న కేసుల్లో కక్షిదారులను రాజీ కుదిర్చేందుకు ఆయా శాఖల అధికారులు కృషి చేయాలని తెలిపారు. జిల్లా కోర్టు ప్రాంగణంలో సమావేశం నిర్వహిస్తామని, వివిధ శాఖల అధికారులు హాజరు కావాలని పేర్కొన్నారు.

ఇంటింటికి శుద్ధజలం అందించడమే లక్ష్యం



నల్లాను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, చైర్మన్

మంచిర్యాలటౌన్: ప్రతీ ఇంటికి శుద్ధజలం అందించడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం, సీఎం కేసీఆర్ పని చేస్తున్నారని ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలో ఆండాళమ్మ కాలనీలో నిర్మించిన మిషన్ భగీరథ వాటర్ ట్యాంకును సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మంచిర్యాల డివిజన్‌లో రూ.69.35 కోట్లతో తాగునీటి కోసం ఐదు ట్యాంకులు, 203 కిలోమీటర్ల మేర పైప్‌లైన్ పనులు 10,500 ట్యాప్ కనెక్షన్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆండాళమ్మ కాలనీలో రూ.3.64 కోట్ల పనులు, ఇందులో 500 కేఎల్ ట్యాంక్‌కు రూ.1.26 కోట్లు, 14 కిలోమీటర్ల పైపులైన్లకు రూ.2.28 కోట్లు, 474 నల్లా కనెక్షన్లకు రూ.10 లక్షలు ఖర్చు చేసినట్లు తెలిపారు. మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, వైస్ చైర్మన్ గాజుల ముఖేశ్ గౌడ్, కౌన్సిలర్ బొలిశెట్టి సునిత, డీసీసీబీ డైరెక్టర్ తిరుపతి, కౌన్సిలర్లు పోరెడ్డి రాజు, సురేశ్ బల్దువా, సుదమల్ల హరికృష్ణ పాల్గొన్నారు.

బాలికకు భరోసానిద్దాం!

- అన్నింటా వారిని ప్రోత్సహిద్దాం
- అమ్మాయిలపై తగ్గని వివక్ష, అకృత్యాలు
- లింగనిష్పత్తిలో తొలగని అసమానతలు
- నేడు జాతీయ బాలికల దినోత్సవం

'ఆడపిల్ల' అంటే 'ఆడ పిల్లే, కానీ ఈడి పిల్ల' కాదనేది ఓ నానుడి. అంటే అమ్మాయి ఇక్కడ పుట్టి వేరే ఇంటికి వెళ్లాల్సిన ఆమెగా భావిస్తూ.. బాల్యం నుంచే అబ్బాయిలతో పోలిస్తే అమ్మాయిలపై అసమానతలు వెంటాడుతున్నాయి. ఈ ఆధునిక యుగంలోనూ బాలికలకు సమానత్వం సాధ్యమవడం లేదు. చిన్నతనం నుంచే ఇంకా కొన్ని చోట్ల వివక్షను ఎదుర్కొంటున్నారు. మగ సంతానం కోసం కొందరు దంపతులు ఆరాటపడుతున్న ఘటనలు చూస్తున్నాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు, సంరక్షణ చర్యలు తీసుకొచ్చినా సమాజంలో బాలికలపై ఉన్న దృష్టి కోణం ఇంకా మారాల్సి ఉంది. నేడు జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.



సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: బాలికలు చిన్ననాటి నుంచే వివక్షను ఎదుర్కొంటున్నారు. ఇంకా సంప్రదాయాలు, నమ్మకాలతో అమ్మాయిల కంటే అబ్బాయిలే ఎక్కువనే రుగ్మత తగ్గడం లేదు. దీంతో గర్భస్థ సమయంలోనే లింగ నిర్ధారణ చేయించుకోవడం వంటివి జరుగుతున్నాయి. ఇది చట్టవిరుద్ధం అయినప్పటికీ గుట్టుగా సాగుతున్నాయి. ఇంకా కొందరు ఇద్దరు, ముగ్గురు వరుసగా అమ్మాయిలు పుడితే ఆ ఇంటి ఇల్లాలిపై వివక్ష చూపుతున్నారు. లేకపోతే వదిలించుకుంటున్నారు. చట్టాల్లో అమ్మాయిలు అన్నింటా సగమని చాటి చెబుతున్నా.. ఇంకా వారిపై వివక్ష ఆగడం లేదు. వీటన్నింటిని రూపుమాపేందుకు ప్రతీ ఏడాది 2008నుంచి కేంద్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జాతీయ బాలికల దినోత్సవం నిర్వహిస్తున్నారు. 1966 జనవరి 24న ఇందిరాగాంధీ తొలి మహిళా ప్రధాని అయిన రోజును స్త్రీ సాధికారత గుర్తుగా నిర్వహిస్తున్నారు.

ఆగని అకృత్యాలు..

బాలికలపై ఇంకా అకృత్యాలు ఆగడం లేదు. లేత వయస్సులోనే కొన్ని చోట్ల మృగాళ్ల మాయమాటలకు నమ్మి వారి చేతిలో చిక్కుకుంటున్నారు. యేటా పోక్సో కేసులు నమోదవుతున్నాయి. చదువుకునే వయస్సులోనే ఈవ్‌టీజింగ్ గురవుతున్నారు. స్కూళ్లు, ఇంటర్ విద్యార్థుల్లోనూ ఈ పరిస్థితి కనిపిస్తోంది. పోక్సో కేసులు అధికంగా నమోదు అవుతుండడంతో జిల్లా పరిధిలోనే ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేయాల్సి వచ్చింది. ఇక షీ టీంకు సైతం బాలికలను వేధిస్తున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయి. సమాజంలో బాలికల పట్ల ఇంకా అకృత్యాలు ఆగకపోవడం ఆందోళన కలిగిస్తోంది. మారుమూల ప్రాంతాల్లో సరైన అవగాహన లేక బాల్యంలోనే బాలికలకు 18ఏళ్లు నిండకముందే వివాహాలు అవుతున్నాయి. ఇక కొందరు తెలిసీ తెలియని వయస్సులో మితిమీరిన సోషల్ మీడియా, స్మార్ట్ ఫోన్ల వాడకంతోనూ తమ బాల్యంలో తప్పటడుగులు వేస్తున్నారు. ఇప్పటికీ కొంతమంది గిరిజన బాలికలు, తమ బాల్యంలోనే చదువుకు దూరమవుతున్నారు. ఇంకా బాల, బాలిక జనాభా, లింగ నిష్పత్తిలోనూ జిల్లాలో వ్యత్యాసం స్పష్టంగా ఉంది.

పథకాలు అనేకం.. అమలులో లోపం

బాలిక సంరక్షణ కోసం అనేక సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. బేటీ బచావో, బేటీ పడావో, బాలిక సమృద్ధి యోజన, సుకన్య సమృద్ధి యోజన, తదితర పథకాలు అమలవుతున్నాయి. పోస్టాఫీసుల్లో పొదుపు పథకాలు, బాలికల చదువులకు రుణాలు, స్త్రీ, సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోషకాహార పథకాలు, బాలికల కోసం ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకులాలు అందుబాటులో ఉన్నాయి. బాలికల్లో డ్రాపౌట్స్ తగ్గించి, బాలురతో సమానంగా ప్రాథమిక స్థాయి విద్యను అందించే కస్తూరిబాగాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ) దేశ వ్యాప్తంగా అమలులో ఉంది. పోషకాహార లోపం అధిగమించేందుకు అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. బాల్య వివాహాల నిరోధక చట్టం, లైంగిక వేధింపుల నుంచి రక్షణ చట్టం(పోక్సో) అమలులో ఉన్నాయి. ఈ పథకాలపై అమలులో లోపాలను సవరించి, చట్టాలపై అవగాహన పెంచి, బాలికలపై అసమానతలు తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సి ఉంది.

2022లో నమోదైన పోక్సో కేసులు

జిల్లా	కేసులు
మంచిర్యాల	42
కుమురంభీం	17

సున్నా నుంచి ఆరేళ్లలోపు చిన్నారుల సంఖ్య

జిల్లా	బాలురు	బాలికలు	మొత్తం
మంచిర్యాల	38,578	35,147	73,725
కుమురంభీం	34,053	32,153	66,206

సున్నా నుంచి ఆరేళ్ల బాలికల నిష్పత్తి(ప్రతీ వెయ్యి మంది బాలురకు)

జిల్లా	బాలికలు (గ్రామీణం)	బాలికలు(పట్టణం)	మొత్తం
మంచిర్యాల	919	900	911
కుమురంభీం	942	956	944

(జనాభా, లింగ నిష్పత్తి, 2011 లెక్కల ప్రకారం)

మెడికల్ కాలేజీ స్థలంపై అభ్యంతరం

- మున్సిపల్ సమావేశంలో వ్యతిరేకించిన కాంగ్రెస్
- కేటాయిస్తూ తీర్మానించిన పాలకవర్గం



మాట్లాడుతున్న చైర్మన్ పెంట రాజయ్య

మంచిర్యాలటౌన్: మంచిర్యాల ప్రభుత్వ మెడికల్ కాలేజీ నిర్మాణానికి స్థానిక సాయికుంటలోని గర్మిళ్ల శివారు 662, 675 సర్వేనంబర్లలో 14.13 ఎకరాల స్థలాన్ని కేటాయిస్తూ మంచిర్యాల మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో సోమవారం తీర్మానించారు. దీనిపై కాంగ్రెస్ కౌన్సిలర్లు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ సమావేశం నుంచి వెళ్లిపోయారు. ఈ సందర్భంగా మున్సిపల్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్లు వేములపల్లి సంజీవ్, మాజీద్ మాట్లాడుతూ గత ఏడాది వర్షాలకు నీట మునిగిన సాయికుంటలోని స్థలాన్ని మెడికల్ కాలేజీ నిర్మాణం కోసం కేటాయించడం ఏమిటని ప్రశ్నించారు. గోదావరి ఒడ్డున నిర్మించిన మాతాశిశు ఆరోగ్య కేంద్రం నీట మునిగిపోయినా పాలకవర్గానికి సోయి లేదని విమర్శించారు. ఎంసీహెచ్‌ను ఐబీ ఆవరణలో నిర్మించాలని ప్రజలు కోరుతున్నా, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మిస్తున్నారని, ఎంసీహెచ్‌ను మునిగిపోయే ప్రాంతంలో నిర్మించి, మెడికల్ కాలేజీని మరోసారి వరదకు గురయ్యే ప్రాంతంలోనే నిర్మించడం ఎంతవరకు సమంజసమని అన్నారు. కాంగ్రెస్ కౌన్సిలర్ల అభ్యంతరాలపై మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోనే మెడికల్ కాలేజీని నిర్మించాలని, అనువైన ప్రభుత్వ స్థలాల కోసం పరిశీలించి, సాయికుంట స్థలాన్ని ఎంపిక చేశామని అన్నారు. గత ఏడాది వర్షాలకు సాయికుంట స్థలం ముంపునకు గురికాలేదని, అనవసరంగా దీనిని రాజకీయం చేయవద్దని హితవు పలికారు.

పదోన్నతులు, బదిలీల సందడి

- జిల్లాలో ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలు 472
- షెడ్యూల్ ప్రకటించిన విద్యాశాఖ ?
- 27 నుంచి ప్రక్రియ షురూ

మంచిర్యాలఅర్బన్: ఉపాధ్యాయులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న పదోన్నతులు, బదిలీల సందడి మొదలైంది. సోమవారం కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను విద్యాశాఖ ప్రకటించినట్లు తెలిసింది. ఈ నెల 27నుంచి ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ నెల 28నుంచి 30వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. మార్చి 4నాటికి ప్రక్రియ పూర్తి కానుంది. మార్చి 5నుంచి 19వరకు అప్పీళ్లకు అవకాశం కల్పించారు. దరఖాస్తులు అందిన 15రోజుల్లో అప్పీళ్లను పరిష్కరిస్తారు. ఇప్పటికే విద్యాశాఖ ఆదేశాల మేరకు వివరాలు సేకరించే పనిలో జిల్లా విద్యాశాఖ ఉద్యోగులు నిమగ్నమయ్యారు. పోస్టుల ఖాళీలు, ఎనిమిదేళ్ల సర్వీసు పూర్తయిన ఉపాధ్యాయుల వివరాలు సేకరిస్తున్నారు.

ప్రక్రియ ఇలా..

మొదట గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల బదిలీలు నిర్వహిస్తారు. అర్హులైన స్కూల్ అసిస్టెంట్లకు గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతులు కల్పిస్తారు. అప్పటికే ఉన్న స్కూల్ అసిస్టెంట్ ఖాళీలతోపాటు గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల పదోన్నతి పొందిన స్కూల్ అసిస్టెంట్లకు బదిలీలకు అవకాశం ఇస్తారు. అర్హులైన ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించనున్నారు. ఇదివరకు ఉన్న ఎస్జీటీ ఖాళీలతో సహా ఎస్జీటీల నుంచి ఎస్‌ఏలుగా పదోన్నతి పొందిన ఖాళీలను కలుపుకుని బదిలీలు చేపట్టనున్నారు.

ఖాళీలు ఇలా..

జిల్లాలో 2,855 పోస్టులకు గాను 2,383 మంది ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తుండగా 472 ఖాళీలున్నాయి. లోకల్ బాడీ పాఠశాలల్లో 2,689 మంజూరు పోస్టులకు గాను 2,255 మంది విధులు నిర్వర్తిస్తుండగా.. 434 ఖాళీలున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో 166 పోస్టులకు గాను 128 మంది విధులు నిర్వహిస్తుండగా 38 ఖాళీలున్నాయి. పీజీహెచ్ఎం105 పోస్టుల్లో 43, పీఎస్‌హెచ్‌ఎం-69 పోస్టుల మంజూరులో 39 పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది. హెచ్‌ఎంల ఖాళీలను ఎస్‌ఏ పదోన్నతుల ద్వారా భర్తీ చేయనున్నారు. ఖాళీ ఏర్పడిన ఎస్‌ఏ పోస్టులను ఎస్జీటీలతో భర్తీ చేస్తారు. ఇంకోవైపు టీచర్ల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్‌తోపాటు భాషా పండితులకు పదోన్నతులు కల్పించాలని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ ఆధ్వర్యంలో సోమవారం జేసీ మధుసూదన్‌నాయక్‌కు వినతిపత్రం అందజేశారు.



ఈ ఉపాధ్యాయుల సంగతేంటో..?

భాషా పండితులు, వ్యాయామ ఉపాధ్యాయుల, పీఎస్‌హెచ్‌ఎంల అప్‌గ్రేడేషన్ విషయంలో ఇంకా ఊగిసలాట కొనసాగుతోంది. తుది నిర్ణయమైతే ఒకరకంగా, కాకపోతే ఇంకోరకంగా బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ నిర్ణయించే అవకాశం ఉంది. ఇంకోవైపు బ్లాక్ చేయబడిన 13 జిల్లాల స్పౌజ్ కేసుల విషయంలో ఎటూ తేల్చలేదు. 317 బాధిత ఉపాధ్యాయుల సమస్య పరిష్కారం కూడా తేలాల్సి ఉంది.

స్కూల్ అసిస్టెంట్ ఖాళీలు

	తెలుగు	ఉర్దూ మీడియం
గణితం	8	1
భౌతికశాస్త్రం	1	2
జీవశాస్త్రం	37	3
సాంఘిక	82	3

తెలుగు 16, హిందీ 12, ఆంగ్లం 17, ఎస్‌ఏ ఫిజికల్ ఎడ్యుకేషనల్ 1, పీఎస్‌హెచ్‌ఎం 41 గ్రేడ్ హెచ్‌ఎం 43.

భాషాపండితులు : తెలుగు 5, హిందీ 8, ఉర్దూ 2

సెకండరీ గ్రేడ్ టీచర్లు : ఎస్జీటీ(తెలుగుమీడియం 160, ఉర్దూ 10, ఆంగ్లం 2

పీఈటీ తెలుగు 2

మ్యూజిక్ టీచర్ 1, ఆర్ట్ అండ్ డ్రాయింగ్ 4, ఎంటీఐ, పీవీఐ, ఎస్ఐ(తెలుగు) 6

వొకేషనల్ ఇన్‌స్ట్రక్టర్ 4

జూనియర్ అసిస్టెంట్ 1

సర్వీసు పుస్తకాలు అందజేయాలి

గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల ప్రమోషన్‌కు అర్హత కలిగిన స్కూల్ అసిస్టెంట్, తత్సమాన కేటగిరీలో ఉపాధ్యాయులు వెరిఫికేషన్ కోసం ఒరిజినల్ సర్వీసు పుస్తకాలు, ఇతర ధ్రువీకరణ పత్రాలు ఈ నెల 24న డీఈవో కార్యాలయంలో అందజేయాలి. ప్రభుత్వ యాజమాన్యం పాఠశాలలో జనరల్ కేటగిరీ, ఎస్సీ కేటగిరీ 1999వరకు, ఎస్టీ కేటగిరి 2007, పీహెచ్‌సీ కేటగిరీ అందరూ అర్హత కలిగిన స్కూల్ అసిస్టెంట్లు, లోకల్‌బాడీ యాజమాన్యం జనరల్ కేటగిరీలో 2001 డీఎస్సీ 17-10-02 వరకు, ఎస్సీ కేటగిరీ 2005వరకు, ఎస్టీ కేటగిరీ 2007వరకు, పీహెచ్‌సీ కేటగిరీ అందరూ అర్హత కలిగిన స్కూల్ అసిస్టెంట్లు వెరిఫికేషన్ కోసం వచ్చేటప్పుడు జిరాక్స్ కాపీలు వెంట తెచ్చుకోవాలి.

– వెంకటేశ్వర్లు, డీఈవో

జోరుగా మట్టి దందా

- చెరువు శిఖం భూమిలో తవ్వకాలు
- పట్టించుకోని అధికారులు



చెరువు శిఖం భూమిలో తోడేసిన అక్రమార్కులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి ప్రాంతంలో మట్టి దందా జోరుగా సాగుతోంది. ప్రభుత్వ పడావు భూములు, చెరువు, కుంటల శిఖం భూముల నుంచి అక్రమంగా తరలిపోతోంది. అడ్డూఅదుపు లేకుండా కొందరు ట్రాక్టర్ల నిర్వాహకులు మట్టి వ్యాపారం సాగిస్తూ సొమ్ము చేసుకుంటున్నా పట్టింపు కరువైంది. అక్రమార్కులకు కొందరు అండదండలు అందిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. బెల్లంపల్లి, చుట్టుపక్కల ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణాలు జోరందుకున్నాయి. మట్టి అవసరం కావడంతో కొందరు ట్రాక్టర్ల నిర్వాహకులు రేయింబవళ్లు సరఫరా చేస్తున్నారు.

అనుమతి లేకుండానే..

బెల్లంపల్లి మున్సిపాలిటీకి కూతవేటు దూరంలో ఉన్న మంచినీళ్ల చెరువుకు గొలుసుకట్టుగా రెండు చెరువులను నిర్మించారు. ఆ రెండింటిలో ఒకటైన ఎర్రకుంట చెరువుపై కన్నేసి శిఖం భూమిలో నుంచి మట్టిని తోడేస్తున్నారు. మట్టి తవ్వకానికి ఎలాంటి అనుమతి తీసుకోకుండా దందాను సాగిస్తున్నారు. ఇదేతీరుగా ప్రభుత్వ భూములు, అటవీ ప్రాంతానికి చేరువలో ఉన్న ప్రభుత్వ భూముల్లో నుంచి రాత్రి పూట, తెల్లవారు జామున రవాణా చేస్తున్నారు. రేయింబవళ్లు ఇసుక, మట్టి దందా సాగుతున్నా నియంత్రణ చర్యలు కనిపించడం లేదు. మట్టి తరలింపుపై బెల్లంపల్లి ఇరిగేషన్ డీఈ నరేష్‌ను సంప్రదించగా.. అనుమతి లేకుండా చెరువు, కుంటల నుంచి మట్టిని తరలించడం చట్టరీత్యా నేరమని, మట్టి తవ్వకాలకు తప్పనిసరిగా ఇరిగేషన్ శాఖ నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలని తెలిపారు. అక్రమంగా తవ్వకాలు చేపడితే చర్యలు తప్పవని తెలిపారు. చెరువు శిఖం భూమి అన్యాక్రాంతంపై పరిశీలనకు ఏఈని పంపించి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామని తెలిపారు.

శరవేగంగా సామాజిక ఆస్పత్రి నిర్మాణం

- మూడు నెలల్లో అందుబాటులోకి..
- తీరనున్న రోగుల కష్టాలు



చెన్నూర్‌లో నిర్మిస్తున్న ఆసుపత్రి భవనం

చెన్నూర్: చెన్నూర్ మున్సిపాల్టీలో రూ.7కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న 30పడకల సామాజిక ఆస్పత్రి భవన నిర్మాణం శరవేగంగా సాగుతోంది. ఇప్పటివరకు 80శాతం పనులు పూర్తి కాగా.. ఏప్రిల్‌లో ప్రారంభానికి అధికార యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. ఆస్పత్రి నిర్మాణం పూర్తయితే రోగులకు మెరుగైన వైద్యం అందనుంది. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ప్రతీ నెల ప్రభుత్వ విప్ బాల్క సుమన్ అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఆస్పత్రి నిర్మాణం పూర్తయితే చెన్నూర్, కోటపల్లి, వేమనపల్లి, భీమారం మండలాలతో పాటు మహారాష్ట్రలోని సిరోంచలో ఉన్న సుమారు లక్షకు మందికి పైగా ప్రజలకు మేలు జరుగనుంది. ఆయా మండలాల్లో పెద్ద ఆస్పత్రులు లేకపోవడంతో ప్రజలకు చెన్నూర్ ఆసుపత్రే దిక్కు. ఆస్పత్రిని ఆధునిక హంగులతో నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఎక్స్‌రే, రక్త పరీక్షల కోసం ప్రైవేట్‌ను ఆశ్రయించాల్సి వస్తోంది. నూతనం భవనంలో ఎక్స్‌రేతోపాటు రక్త, మూత్ర పరీక్షలు చేయనున్నారు. భవనంలో టైల్స్ తోపాటు విద్యుత్ వైరింగ్ పనులు చేపట్టాల్సి ఉందని, మూడు నెలల్లో నిర్మాణం పూర్తి చేసి వైద్య విధాన పరిషత్‌కు అప్పగిస్తామని టీఎస్‌ఎంఐడీసీ డీఈ నర్సింగరావు తెలిపారు.

కంటి వెలుగు శిబిరం పరిశీలించిన కలెక్టర్



నిర్వాహకులతో మాట్లాడుతున్న కలెక్టర్

జన్నారం: మండలంలోని పొనకల్ గ్రామ పంచాయతీలో కంటి వెలుగు శిబిరాన్ని కలెక్టర్ భారతి హోళ్లికేరి సోమవారం ఆకస్మికంగా పరిశీలించారు. రిజిస్టర్ నమోదు, పరీక్ష విభాగం, కళ్లద్దాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. శిబిరం పరిధిలోని ప్రజలు పరీక్షలు చేసుకునేలా చూడాలని, లక్ష్యం పూర్తి చేయాలని సూచించారు. కంటి వెలుగుపై గ్రామాల్లో ప్రచారం చేయాలని తెలిపారు. ఎంపీడీవో అరుణరాణి, పొనకల్ సర్పంచ్ జక్కు భూమేశ్, వైద్యాధికా రి ఉమాశ్రీ, ఇంచార్జి గౌరీశంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజావాణిపై అశ్రద్ధ చేయొద్దు

జైపూర్: మండల స్థాయి అధికారులు ప్రజావాణి కార్యక్రమంపై అశ్రద్ధ చేయొద్దని జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రజావాణి కార్యక్రమానికి హాజరు కాని 12మంది ఆయా శాఖల అధికారులకు నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు. ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తెలిపారు. ఈ సమావేశంలో మండల ప్రత్యేక అధికారి ప్రభాకర్‌రావు, తహసీల్దార్ మోహన్‌రెడ్డి, ఎంపీడీవో సత్యనారాయణ, డిప్యూటీ తహశీల్దార్ కృష్ణ పాల్గొన్నారు.



కంటి పరీక్షలను పరిశీలిస్తున్న మధుసూదన్

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

కంటి వెలుగును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని సోమవారం ఆయన సందర్శించారు. డీఎల్‌పీవో ప్రభాకర్‌రావు, ఎంపీడీవో సత్యనారాయణ పాల్గొన్నారు.

బీడీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ధర్నా



ధర్నాలో పాల్గొన్న నాయకులు

మంచిర్యాలఅగ్రికల్చర్: బీడీ కార్మికులందరికీ ఆంక్షలు లేని జీవనభృతి అందించాలని, ఆసరా పింఛన్ రూ.2016 ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్(ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు చింతల భూమేశ్వర్, సూర్యశివాజీ మాట్లాడుతూ వెంటనే బీడీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మల్లన్న, జ్యోతి, మంగ, అరుణ తదితరులు పాల్గొన్నారు.

'వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే'



కార్యక్రమంలో పాల్గొన్న సురేఖ

శ్రీరాంపూర్: కేసీఆర్‌ను ప్రజలు గద్దె దించే రోజు వచ్చిందని, ఇక వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే అని డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ అన్నారు. సోమవారం ఆమె హాత్‌సే హాత్ జోడో అభియాన్ కార్యక్రమంలో భాగంగా శ్రీరాంపూర్ ఆర్కే 6 హట్స్ ఏరియాలో గడపగడపకు కార్యక్రమం నిర్వహించారు. ముందుగా హనుమాన్ ఆలయంలో పూజలు చేశారు. అనంతరం ఆమె ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలు, నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ, కొక్కిరాల రఘుపతిరావు చారిటబుల్ ట్రస్ట్ అందిస్తున్న సేవా కార్యక్రమాలు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం అవుతుందని, మంచిర్యాల నియోజకవర్గం అభివృద్ధిలో ఆమడదూరంలో ఉందని తెలిపారు. మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సుర్మిళ్ల వేణు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి, కౌన్సిలర్లు తెనుగు లావణ్యదేవేందర్, బొద్దున సంధ్యారామ్మూర్తి, సీపతి సుమతిమల్లేశ్, గెల్లు రజిత, నాయకులు భూపతి శ్రీనివాస్, కలవేని శ్యాం, ఒడ్నాల రాజన్న, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు పెంట రజిత, ప్రధాన కార్యదర్శి ఆడెపు శ్యామల, యశోద, మైనారిటీ సెల్ అధ్యక్షులు ఖాలిద్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

తాటిగెల పడి గీతకార్మికుడికి గాయాలు

జన్నారం: మండలంలోని చింతలపల్లి గ్రామానికి చెందిన బత్తిని శ్రీనివాస్‌గౌడ్ తాడి చెట్టు ఎక్కి కల్లు గీసే క్రమంలో గాయపడ్డాడు. తాటిచెట్టు ఎక్కి కమ్మలు కోసే క్రమంలో కత్తి గెలపై పడడంతో గెల తెగి అతడి వీపుపై పడింది. దీంతో మెడ, వీపు, భుజంపై గాయాలయ్యాయి. కరీంనగర్ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. గీత కార్మికుడికి ప్రభుత్వ పరిహారం అందేలా చూడాలని గౌడ సంఘం మండల అధ్యక్షుడు భాస్కర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి రమేశ్‌గౌడ్ కోరారు.

ఒకరికి జైలు శిక్ష

కౌటాల(సిర్పూర్): కౌటాల మండలం తాటిపల్లి గ్రామానికి చెందిన నవ్‌గడే వత్తుకు సిర్పూర్(టి) సివిల్ కోర్టు న్యాయమూర్తి ఆరు నెలల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. 2015 జూలై 8న తాటిపల్లి గ్రామానికి చెందిన అన్నదమ్ములు ఎస్.శంకర్, ఎస్.వత్తు మధ్య గొడవ జరిగింది. శంకర్, అతడి భార్య సాయిబాయిపై వత్తు కర్రతో దాడి చేశాడు. శంకర్ తలకు గాయం కావడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్సై వెంకటేశ్ కేసు నమోదు చేశారు. సిర్పూర్(టి) సివిల్ కోర్టులో పది మంది సాక్షులను విచారించగా నేరం రుజువైంది. న్యాయమూర్తి నిందితుడికి ఆరు నెలల జైలు, రూ.1000 జరిమానా విధించినట్లు ఎస్సై వెల్లడించారు.

ఆటో బోల్తా.. ముగ్గురికి గాయాలు


ఘటనా స్థలంలో క్షతగాత్రులు

కౌటాల(సిర్పూర్): కౌటాల మండలం ముత్తంపేట శివారులో సోమవారం సాయంత్రం కౌటాల– కాగజ్‌నగర్ ప్రధాన రహదారిపై ఆటో బోల్తా పడి ముగ్గురికి గాయాలయ్యాయి. ముత్తంపేటకు చెందిన మహిళలు సోమవారం కౌటాల వారసంతకు వెళ్లారు. సరుకులు కొనుగోలు చేసిన అనంతరం ఏడుగురు ఆటోలో స్వగ్రామానికి బయలుదేరారు. గ్రామ శివారులో ప్రధాన రహదారిపై గేదె అడ్డురావడంతో ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఆదే చిన్నుబాయి, బి.సుశీల, మరొకరికి గాయాలు కాగా, అంబులెన్స్‌లో కాగజ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు.

శిక్షణ తరగతులు నిర్వహించాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రభుత్వ కార్యాలయాల్లో పీఐవో, ఏపీఐవోలు, అప్పీలేట్ అధికారులకు సమాచార హక్కు చట్టంపై శిక్షణ తరగతులు నిర్వహించాలని సమాచార హక్కు సలహా, సహాయ రక్షణ సమితి నాయకులు జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్‌కు వినతిపత్రం అందజేశారు. సమాచార హక్కు, సలహా, సహాయ రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు సరికొండ రుషికిశ్వర్ మాట్లాడుతూ నిర్ణీత గడువులోగా సమాచారం ఇవ్వడంలో విఫలం అవుతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవులపల్లి కార్తీక్, రాష్ట్ర కార్యదర్శి కూరపాటి నరసింహారాజు, ఆమ్‌ఆద్మీ నాయకులు నాగేంద్రప్రసాద్, సతీష్, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.


నాగోబా దర్శనానికి బారులు తీరిన భక్తులు

నాగోబాకు మొక్కి.. పెర్సపేన్‌ను పూజించి...


సంప్రదాయ వాయిద్యాలతో ప్రధాన్ కిత మెస్రం వంశీయులు


పుట్టలు తయారు చేస్తున్న మెస్రంవంశ ఆడపడుచులు


లోక భూమారెడ్డిని సన్మానిస్తున్న మెస్రం వంశీయులు


కొత్త కోడళ్లకు చరిత్ర బోధిస్తున్న మెస్రం గంగారాం



- వైభవంగా కొనసాగుతున్న నాగోబా జాతర
- కొనసాగుతున్న మెస్రం వంశీయుల సంప్రదాయ పూజలు
- తరలి వస్తున్న భక్తులతో కిటకిటలాడుతున్న కేస్లాపూర్

ఇంద్రవెల్లి(ఖానాపూర్): పుష్యమాస అమావాస్యను పురస్కరించుకుని ఈ నెల 21న పవిత్ర గంగాజలంతో నాగోబాకు మహాపూజ నిర్వహించి జాతర ప్రారంభించిన మెస్రం వంశీయులు సోమవారం పెర్సపేన్, భాన్‌దేవతలకు ఘనంగా పూజలు నిర్వహించారు. భేటింగ్ అయిన కొత్తకోడళ్ల కోనేరు వద్దకు వెళ్లి పవిత్ర జలాలను తీసుకువచ్చారు. మెస్రం వంశ అల్లుళ్లు భాన్‌దేవత ఆలయం ఎదుట ఉన్న పాత పుట్టలను తొలగించడంతో మెస్రం వంశ ఆడపడుచులు పవిత్ర జలాలతో భాన్‌దేవతను శుద్ధి చేశా రు. ప్రత్యేక పూజలు చేసి నైవేద్యం సమర్పించారు.

కొత్త కోడళ్లకు చరిత్ర బోధన

గోవడ్ వద్ద బస చేసిన మెస్రం వంశీయులు సోమవారం సంప్రదాయ వంటలు చేసి సంహపంక్తి భోజనాలు చేశారు. ప్రధాన్ కితకు చెందిన మెస్రం గంగారాం ఆధ్వర్యంలో కిక్రి వాయిస్తూ కొత్తకోడళ్ల, మెస్రం వంశ మహిళలకు నాగోబా చరిత్ర, మెస్రం వంశంలోని 22 కితల చరిత్రను బోధించారు. అనంతరం ప్రధాన్ కిత మెస్రం వంశీయులకు కొత్త కోడళ్లు, మెస్రం వంశ మహిళలు కానుకలు అందించారు.

గాయిక్ కిత మెస్రం వంశీయుల మొక్కులు

గాయికి కితకు చెందిన మెస్రం వంశీయులు సోమవారం నాగోబా ఆలయంలో ఆవుదూడను వదిలి మొక్కును చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 15 ఏళ్లుగా గాయికి కితలో కోడళ్లకు భేటింగ్ అయ్యే అవకాశం రాకపోవడంతో నాగోబాకు మొక్కినట్లు తెలిపారు. నాగోబా ఆశీర్వాదంతో ఈసారి తమ కితకు చెందిన కోడళ్లకు భేటింగ్ చేసే అవకాశం వచ్చిందని, 100 మందికి భేటింగ్ (పరిచయం) చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో గాయిక్ కిత మెస్రం వంశ పెద్దలు శేఖర్‌బాబు, మానిక్‌రావ్, దేవ్‌రావ్, మనోహర్, జంగు, తదితరులు పాల్గొన్నారు.

నేడు నాగోబా దర్బార్

- హాజరు కానున్న మంత్రులు సత్యవతి రాథోడ్, అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి


ముస్తాబైన నాగోబా దర్బార్ వేదిక

ఇంద్రవెల్లి(ఖానాపూర్): ఈ నెల 21న మెస్రం వంశీయుల మహా పూజతో ప్రారంభమైన నాగోబా జాతర కొనసాగుతోంది. ఉమ్మడి జిల్లాతో పాటు తెలంగాణ, మహారాష్ట్రల నుండి అధికసంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. సోమవారం విజయ డెయిరీ మాజీ చైర్మన్ లోక భూమారెడ్డితో పాటు జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు నాగోబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. జాతరను పురస్కరించుకుని నేడు నిర్వహించనున్న నాగోబా దర్బార్‌కు రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్, దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, ఎమ్మెల్సీలు కవిత, దండె విఠల్, జిల్లా ఎంపీలు, ఎమ్మెల్యేలు హాజరుకానున్నారు.

ఇదీ దర్బార్ చరిత్ర

నాగోబా దర్బార్‌కు ప్రత్యేక చరిత్ర ఉంది. 77 ఏళ్ల క్రితం భూమికోసం, భుక్తి కోసం, విముక్తికోసం జల్ జంగల్ జమీన్ నినాదంతో కుమురంభీం నిజాం సర్కార్‌తో పోరాటం చేశాడు. అతని పోరాటానికి ఉల్లికిపడ్డ నిజాం సర్కార్ ఆదివాసీ గిరిజనులపై అధ్యాయనం చేయడానికి మానవపరిణామ శాస్త్రవేత్త హైమాన్‌డార్ఫ్‌ను ఉమ్మడి ఆదిలాబాద్‌కు పంపించింది. జిల్లాకు వచ్చిన హైమాన్‌డార్ఫ్ మార్లవాయి గ్రామంలో ఉండి ఆదివాసీ గిరిజన గ్రామాల్లో పర్యటించారు. ఆదివాసీలపై అధ్యయనం చేసే సమయంలో పుష్య మాసంలో ఉమ్మడి జిల్లా మెస్రం వంశీయులంతా కేస్లాపూర్ గ్రామానికి చేరుకుని వారంరోజులు అక్కడే ఉండి నాగోబాకు పూజలు చేస్తున్న విషయం తెలుసుకున్నారు. వారి సమస్యలు, స్థితిగతులు తెలుసుకునేందుకు ఇదే మంచిస్థలంగా గుర్తించిన హైమన్‌డార్ఫ్ 1946లో నాగోబా దర్బార్ పేరుతో వారితో సమావేశమయ్యాడు. ఆక్వామే కదీం(ఆదివాసీ సంక్షేమ శాఖ కమిటీ)ని ఏర్పాటు చేశాడు. ఏటా పుష్యమాసంలో కేస్లాపూర్‌కు వచ్చి ఆదివాసీల స్థితిగతులు తెలుసుకుని నిజాం సర్కార్‌కు పంపించేవారు. అప్పటి నుంచి ఆక్వామే కదీం కమిటీ సభ్యులు, మెస్రం వంశీయులు ప్రతీ సంవత్సరం దర్బార్ నిర్వహిస్తున్నారు. 1981 ఇంద్రవెల్లి సంఘటన తర్వాత 1983 నుంచి ఏటా ఐటీడీఏ గిరిజన సంక్షేమ శాఖ ద్వారా అధికారికంగా దర్బార్ నిర్వహిస్తోంది. ఆదివాసీల నుంచి దరఖాస్తులు స్వీకరించి సమస్యలు పరిష్కరిస్తున్నారు. నేడు నిర్వహించనున్న దర్బార్ సమావేశానికి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 11 గంటలకు మంత్రులు నాగోబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం దర్బార్ సమావేశంలో పాల్గొననున్నట్లు ఆలయ ఈవో రాజమౌళి తెలిపారు.

ఘనంగా పూజలు

గోవడ్ నుంచి వచ్చిన మెస్రం ఆడపడుచులు, మహిళలు భాన్‌దేవతలకు పూజలు చేయగా మెస్రం వంశీయులు పక్కనే ఉన్న నాలుగు సగల పెర్సపేన్ (పెద్ద దేవుళ్ల)కు పూజలు నిర్వహించారు. గోదావరి నుంచి తీసుకువచ్చిన పవిత్ర గంగాజలంతో పెర్సపేన్ దేవుళ్లను శుద్ధిచేసి పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమంలో మెస్రం వంశానికి చెందిన పురుషులు మాత్రమే పాల్గొన్నారు. ఈ నెల 25న గోవడ్ ముఖద్వారం వద్ద బేతల్ పూజలు చేసి మెస్రం వంశీయుల సంప్రదాయ పూజలు ముగించనున్నట్లు నాగోబా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్రావ్ తెలిపారు.

ఆలయ అభివృద్ధికి కృషి

- జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి
- జంగో.. లింగో దీక్ష విరమణ


దీక్ష విరమణ చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి

నార్నూర్(జైనూర్): జైనూర్ మండలం జంగాంలోని జంగో.. లింగో ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి అన్నారు. జంగాం గ్రామంలోని జంగో.. లింగో ఆలయంలో సోమవారం కిషన్ మహరాజ్ చేతుల మీదుగా దీక్ష విరమణ చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ జైజంగో.. జైలింగో దీక్ష ఎంతో పవిత్రమైందని అన్నారు. పుష్యమాసంలో నియమనిష్టలతో జంగుబాయి, పెర్సపేన్‌లను భక్తిభావంతో పూజలు చేస్తారని పేర్కొన్నారు. ఆదివాసీలు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఇప్పటికే దీక్ష భూమి వద్ద భక్తుల సౌకర్యార్థం భవన నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. ఆలయ ఆవరణలో త్వరలో సీసీ వేస్తామని, బోరు బావి మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ శాఖ చైర్మన్ కనక యాదవ్‌రావు, దీక్షభూమి పీఠాధిపతి కుమ్ర భగవంత్‌రావు, సర్పంచ్ శ్యాంరావు, వైస్ ఎంపీపీ లక్ష్మణ్, ఎంపీటీసీ భగవంత్‌రావు, సంస్థానం అధ్యక్షుడు రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసులు క్రమశిక్షణకు మారుపేరుగా నిలవాలి

- రామగుండం డీసీపీ(అడ్మిన్) అఖిల్‌మహాజన్
- ముగిసిన ఏఆర్ పోలీసుల శిక్షణ


పరేడ్‌ను పరిశీలిస్తున్న డీసీపీ అఖిల్ మహాజన్

మంచిర్యాలక్రైం: పోలీసులు క్రమశిక్షణకు మారుపేరుగా నిలవాలని రామగుండం పోలీస్ కమిషనరేట్ డీసీపీ(అడ్మిన్) అఖిల్‌మహాజన్ అన్నారు. కమిషనరేట్ హెడ్ క్వార్టర్స్‌లో ఈ నెల 10నుంచి 23 వరకు మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల ఆర్మ్‌డ్ రిజర్వ్(ఏఆర్) పోలీసులకు నిర్వహించిన శిక్షణ తరగతులు ముగిసాయి. సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీసీపీ మాట్లాడుతూ పోలీసులు విధి నిర్వహణలో నిబద్ధత, నిస్వార్థంగా సేవలు అందిస్తూ ప్రజలకు రక్షణ కల్పించాలని అన్నారు. ధర్నాలు, రాస్తారోకోలు, ర్యాలీలు, చట్టవ్యతిరేకమైన చర్యలకు పాల్పడిన సమయంలో చేసే మాబ్ ఆపరేషన్‌పై నిరంతరం సాధన చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ ఏసీపీ సుందర్‌రావ్, మల్లికార్జున్, ఆర్‌ఐ మధూకర్, శ్రీధర్, విష్ణుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బాలికలు చదువును కొనసాగించాలి


అవగాహన కల్పిస్తున్న సత్యనారాయణ

మంచిర్యాలటౌన్: బాలికల సాధికారత వారి చేతుల్లోనే ఉందని, చదువే అందుకు మూలకారణమని, ప్రతీ ఒక్క ఆడపిల్ల చదువును కొనసాగించాలని అడిషనల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ హేమసత్య, జిల్లా బాలల సంరక్షణ అధికారి ఆనంద్, చైల్డ్ హెల్ప్ లైన్ జిల్లా సమన్వయకర్త సత్యనారాయణ అన్నారు. జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ మైనారిటీ బాలికల ఆశ్రమ పాఠశాలలోని విద్యార్థులకు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆడపిల్లలు సమాజంలో ఎదురయ్యే పలు సమస్యలను పరిష్కరించుకుని, ధైర్యంతో ప్రభుత్వం అందించే సహాయ సహకారాలను అందిపుచ్చుకుని ఉన్నత స్థానాలను అధిరోహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో చైల్డ్‌లైన్ సిబ్బంది తిరుమల, వరలక్ష్మీ, రేణుక, బాలసదనం ఇంచార్జి లక్ష్మీ పాల్గొన్నారు.

వెటరన్ అథ్లెటిక్స్‌లో రిటైర్డ్ కార్మికుడి ప్రతిభ


బహుమతి సాధించిన రాజకొమురయ్య

రామకృష్ణాపూర్: నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 21, 22 తేదీల్లో మెదక్‌లోని ఇందిరాగాంధీ స్టేడియంలో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ చాంపియన్ షిప్ పోటీల్లో రామకృష్ణాపూర్‌కు చెందిన సింగరేణి రిటైర్డ్ కార్మికుడు రాజకొమురయ్య ప్రతిభను చాటాడు. 60 ఏళ్ల పైబడి వయసు విభాగంలో ఐదు కిలోమీటర్ల వాక్‌లో తృతీయ బహుమతి సాధించాడు. వెటరన్ అథ్లెటిక్స్ పోటీల్లో వరుసగా బహుమతులు సాధిస్తున్న రాజకొమురయ్యను స్థానిక సీనియర్ క్రీడాకారులు అభినందించారు.

ఎస్పీఎం ఉద్యోగికి బంగారు, వెండి పతకాలు

కాగజ్‌నగర్‌టౌన్: తొమ్మిదో రాష్ట్రస్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో సిర్పూర్ పేపర్ మిల్లు ఉద్యోగి పెరక కృష్ణ సత్తా చాటాడు. మెదక్ జిల్లా కేంద్రంలోని మైదానంలో ఈ నెల 21, 22 తేదీల్లో జరిగిన ఈ పోటీల్లో రెండు బంగారు పతకాలు, ఒక కాంస్య పతకం సాధించాడు. 50 సంవత్సరాల విభాగంలో 100 మీటర్లు, 200 మీటర్ల పరుగు పందెంలో రెండు బంగారు, లాంగ్ జంప్‌లో కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నాడు. నిర్వాహకులు మర్రి లక్ష్మారెడ్డి, దేవేందర్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డులు అందుకున్నాడు. ఈ సందర్భంగా పెరక కృష్ణను ఎస్పీఎం యాజమాన్యం అభినందించింది.

పాడి పశువులకు గర్భకోశ వ్యాధి పరీక్షలు

జన్నారం/దండేపల్లి: పాడిపశువులకు గర్భకోశ వ్యాధి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి వై.రమేష్ అన్నారు. సోమవారం జన్నారం మండలం కామన్‌పల్లి, దండేపల్లి మండల కేంద్రంలోని నిర్వహించిన పశు వైద్య శిబిరాలను ఆయన సందర్శించారు. జన్నారం మండల పశువైద్యాధికారి శ్రీకాంత్, సర్పంచ్ మానస, ఎంపీటీసీ మాధవి, తపాలపూర్ పశువైద్యాధికారి కిరణ్, గోపాల మిత్ర సూపర్వైజర్ రవి, దండేపల్లి సర్పంచ్ చంద్రకళ, ఎంపీటీసీ శ్రీనివాస్, ఉపసర్పంచ్ భూమన్న, మండల పశువైద్యాధికారి ధన్‌రాజ్ పాల్గొన్నారు.

ఏడు రెట్లు పెరిగిన సింగరేణి ఆస్తి పన్ను


జీఎంకు వివరాలు అందిస్తున్న కమిషనర్ రమేశ్

శ్రీరాంపూర్: నస్పూర్ మున్సిపల్ పరిధిలోని సింగరేణి క్వార్టర్లు, ఇతర కంపెనీ కార్యాలయాలు, ఇతర భవన నిర్మాణ సముదాయాలకు మున్సిపాలిటీ వసూలు చేసే ఆస్తి పన్ను ఈసారి అనూహ్యంగా పెరిగింది. చాలా ఏళ్ల క్రితం గ్రామ పంచాయతీలుగా ఉన్నప్పుడు లెక్కించిన ఆస్తి పన్నునే ఇన్నాళ్లు చెల్లిస్తూ వస్తున్నారు. ఇటీవల అధికారులు మున్సిపల్ యాక్ట్ ప్రకారం రీ సర్వే చేశారు. పాత ఆస్తిపన్నుతో పోల్చితే ఈసారి ఏడు రెట్ల ఆదాయం మున్సిపల్‌కు సమకూరనుంది. ఈ మేరకు పూర్తి వివరాలను నస్పూర్ మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేశ్ సోమవారం శ్రీరాంపూర్ జీఎం బీ.సంజీవరెడ్డిని కలిసి సమర్పించారు. పాత ఆస్తి పన్ను రూ.50,38,426గా ఉంది. పదేళ్ల నుంచి సింగరేణి ప్రతీ సంవత్సరం ఆస్తి పన్ను ఇంతే చెల్లిస్తూ వస్తోంది. ఇప్పుడు రూ. 3,71,68,554కు పెరిగిందని, పెరిగిన పన్ను ప్రకారం సింగరేణి చెల్లించాలని జీఎంను కోరారు.

అక్రమ తవ్వకాలు నిలిపివేయాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: మందమర్రి మండలం తిమ్మాపూర్ శివారు బొక్కలగుట్ట వద్ద బండరాయి, మొరం అక్రమ తవ్వకాలను నిలిపివేయాలని బొక్కలగుట్ట గ్రామస్తులు సోమవారం కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. సర్వే నంబరు 139 భూమిలో నామమాత్రంగా రాయల్టీ చెల్లిస్తూ కొందరు మైనింగ్, రెవెన్యూ, సర్వేయర్ అధికారులతో కుమ్మక్కై గుట్ట బండరాయిని, మొరాన్ని తరలిస్తున్నారని పేర్కొన్నారు. గుట్ట చుట్టూ ఉన్న పంట పొలాల్లో దుమ్ము, ధూళి చేరి నష్టపోతున్నామని తెలిపారు. రైతుబంధు కోర్డినేటర్ బలికొండ కిషన్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ విక్రమ్‌గౌడ్, గ్రామస్తులు సామల శ్రీనివాస్, రాములు, మహేందర్, రాజయ్య, కేదారిగౌడ్, బాలరాజు, నరేందర్, తదితరులు పాల్గొన్నారు.




కల్లు తాగిన కోతులు



ఆ కోతులకు దాహం వేసిందేమో.. ఏకంగా తాటిచెట్టు ఎక్కేశాయి. తాటిగెలలకు ఏర్పాటు చేసిన లొట్లలోని కల్లు తాగేశాయి. మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం బొక్కలగుట్ట గ్రామ శివారులో కనిపించిన ఈ దృశ్యాలను 'సాక్షి' కెమెరా క్లిక్‌మనిపించింది.

- సాక్షి ఫొటోగ్రాఫర్, మంచిర్యాల